# ప్రైవేట్ ప్రాక్టీస్ బంద్

"నేనీనాళ ఫష్టో సినిమాకెళ్తున్నా....తళాలు పక్కింట్లో ఇస్తాను.. సాయంత్రం ఆఫీసునుండి ఇంటికీ వచ్చాక తాళాలు తీసోకండి...." అంది భర్తతో అనసూయ.

"అట్టాగే....హాఛ్...." అన్నాడు స్టౌమీది అన్నం కలుపుతూ పుల్లారావు....

"ఏంటలా తుమ్ముతున్నారు? —ఏం వేళాకోళంగా ఉందా?.... మీరెన్ని తుమ్ములు తుమ్మినా సినిమా టిక్కెట్లు దొరుకుతాయ్ లెండి!..." అంది కోపంగా.

"నేను సినిమా చూసి చాల్రోజులైంది... ఆఫీసునుండి నేనుకూడా డైరెక్టుగా సినిమా థియేటర్ కి రానావోనీ....హి!" మస్కా కొట్టూ అడిగాడు పుల్లారావు.

"మీరూ సినిమాకి వస్తే వంటెవరు చేస్తారూ?...అయినా ఈ సినిమాకి మీర్రాకూడదు... దీంట్లో అన్నీ బూతుడైలాగులూ, రేపుసీన్లూ, క్లబ్బు డాన్సులూ ఉన్నాయట!... మీరు ఆదివారం "పుణ్యక్షేత్రం-దైవ శక్తి విచిత్రం" సినిమా మ్యాట్నీ షోకి వెళ్దురుగానీ"

"అట్టాగే... నీ ఇష్టం.. హి... కానీ ఇదైనా కూడా పర్లేదేమో... నేను పెద్దాడ్నేగా?...హి"

"ఏం పెద్ద మీ మొహం!... నా మొహానికి ఓ పిల్లా పీచా?... నే చెప్పిన సినిమాకే వెళ్ళండి... ఈ వేళ మాత్రం నేను వెనకింటావిడతో వెళ్తా..."


"అలాగే...హాఛ్..."

"ఊః...ఊః ... ఏంటి తెగ తుమ్ములొస్తున్నాయ్ చీరేస్తా... అన్నట్టు చీరేస్తా అంటే గుర్తొచ్చింది.. ఈ పేళ మాంచి చీరొకటి కూడా కొనుక్కుందామని అనుకుంటున్నా"

"హాఛ్..."

అనసూయ భర్తవంక కోపంగా చూసింది.

"అయ్యోరాతా?... ఎందుకలా చూస్తావ్?... నేనేం కావాలని తుమ్మడం లేదు...నాకు బాగా జలుబు చేసింది..." అన్నాడు పుల్లారావు భయం భయంగా భార్యవంక చూస్తూ.




"నిజంగా జలుబు చేసిందా?"

"నిజం...నీ మీదొట్టు!.,. హాఛ్..."

అనసూయ భర్త నుదుటిమీద చెయ్యిపెట్టి చూసింది.

"హామ్మో . హామ్మో.. మీ మొహం మంత వట్టి జలుబేంటి... కాస్త జ్వరం కూడా ఉందే... త్వరగా డాక్టర్ దగ్గరికి వెళ్ళండి. .."అంది కంగారుగా అనసూయ.

"పోనెద్దూ... అదే తగ్గిపోతుంది..."

"ఏం తగ్గడం?... మందూ మాకూ లేపోతే ఇంకా ఎక్కువై పోతుంది.. నా మాటవిని వెంటనే డాక్టర్ దగ్గరికెళ్ళండి..."

"నేనంటే నీకెంత ప్రేమే అనసూయా!" కరిగిపోతూ అన్నాడు పుల్లారావు.

"ప్రేమా బొందా? జ్వరంతో మీరు మూలపడ్తే వంటెవరు చేస్తారూ? ఇంతకీ ఈ పూట వంటైపోయినట్టేనా?"

"ఇదిగో స్టౌవ్‌మీది నుండి అన్నం దింపేస్తే అయిపోయినట్టే హాఛ్.." పుల్లారావు స్టౌవ్‌మీంచి అన్నం దింపేసాడు.

"ఊ... ఊ... మీరిహ డాక్టర్ దగ్గరికి పదండి" అంటూ భర్తని మెడపట్టి బయటికి గెంటింది అనసూయ.

పుల్లారావు వీధి చివర ఉన్న క్లినిక్‌కి వెళ్ళాడు.

క్లినిక్‌కి తాళం వేసు.ది. డాక్టర్ ఇంకా రాలేదేమో! లేదా ఏదైనా ఊరెళ్ళాడో!!! అనుకున్నాడు.

ఆ పక్క వీధిలోని మరో క్లినిక్‌కి వెళ్ళాడు.

అదీ మూసి ఉంది. ఆ కాలనీలోనే మరో క్లినిక్‌కి వెళ్ళాడు. అది కూడా మూసి ఉంది.

పుల్లారావుకి ఏమీ అర్థం కాలేదు. డాక్టర్లందరూ క్లినిక్‌లు మూస్కుని కూర్చున్నారేంటి."

"ఏంటి క్లినిక్ ముందు నిల్చుని ఆలోచిస్తున్నారు? డాక్టరుగారి కోసమా?" దారినపోయే ఓ పెద్దమనిషి పుల్లారావుని అడిగాడు.

"అవునండీ. అదేంటోగానీ కాలనీలో అన్ని క్లినిక్‌లూ మూసేసి ఉన్నాయ్" అన్నాడు పుల్లారావు.

"ఈ వేళ నుండి గవర్నమెంటాసుపత్రుల్లో పనిచేసే డాక్టర్లు ప్రైవేట్ ప్రాక్టీస్ చెయ్యకూడదు. బ్యాన్ చేసారు. ఆ విషయం తెలీదా?"

పుల్లారావ్ కంగారు పడ్డాడు. తమ డాక్టర్ని కల్సి మందులు కొను

క్కని వెళ్ళకపోతే అనసూయ దంచుతుంది. ప్రైవేట్ ప్రాక్టీస్ బ్యాన్ చేసారని చెప్తే అర్థం చేస్కోదు.

"హర్రే! . ఇప్పుడెలా మరి? అసలే నాకు జ్వరంగా ఉంది!!..." అన్నాడు.

"గవర్నమెంట్ ఆస్పత్రులున్నాయ్‌గా... అక్కడికే వెళ్ళాలిహ. అన్నట్టూ ప్రైవేట్ ప్రాక్టీసు లేదని తెలీదంటున్నారు. మీరు న్యూస్ పేపరు చదవరా?" అడిగాడు పెద్ద మనిషి.

"లేదండీ... ఎక్కడా ఆఫీసుపనీ వంటపనితో పేపర్ చదవడానికి టైమస్సలు దొరకదు."

"సర్లే... మేం మాత్రం ఇళ్ళలో వంటపని చెయడం లేదా ఏంటి?" అన్నాడు ఆయన చిత్రంగా చూస్తూ.

పుల్లారావు తృప్తిగా ఊపిరి పీల్చుకున్నాడు.

నేనే అనుకున్నాగానీ. పర్లేదే. వెరే ఇళ్ళలో కూడా నాలాగా వంట చేసే మగాళ్ళున్నారన్నమాట!

అక్కడినుండి పుల్లారావ్ ఓ అయిదు రూపాయలు ఖర్చుపెట్టుకొని ఆటోలో గవర్నమెంటాస్పత్రికి వెళ్ళాడు. ఆటో దిగి గేట్లోంచి వెళ్తుంటే "నమస్తేసార్..!..." అన్నాడు వాచ్‌మేన్ నవ్వుతూ.

"నమస్తే.'" అన్నాడు పుల్లారావ్ సంబరపడిపోతూ.

గవర్నమెంటాస్పత్రంటే ఎంతో వరస్టుగా ఉంటుందనుకున్నా గానీ.. పర్లేదే!.. వీళ్ళంతా చాలా మర్యాదగా చూసేట్టున్నారు!

ఇలా అనుకుని రెండడుగులు వేసాడోలేదో కాళ్ళకి ఏదో అడ్డొచ్చి బోర్లా పడిపోయాడు.

కిందినుండి లేచి బట్టల కంటిన దుమ్ము దులుపుకుని నేలమీద చూసాడు "ఏంటబ్బా నా కాలుకి అడ్డు తగిలింది!!"

"సాబ్.. అక్కడేం లేదు నీ కాలుకి నేనే నా లాఠీ కర్రని అడ్డు పెట్టి పడేసాను." అన్నాడు వాచ్‌మేన్.

"ఎందుకూ?" ఆశ్చర్యంగా అడిగాడు పుల్లారావు.

"ఎందుకేమిటి సాబ్? చేతిలో డబ్బులు పెట్టకుండా ముందుకెట్టా ఎల్తారు సాబ్?!" అన్నాడు గీరగా.

"ఎంత?" అడిగాడు పుల్లారావు.

"రెండ్రూపాయలు!"

వాడి చేతిలో రెండురూపాయల నోటుపెట్టి లోపలికి వెళ్ళాడు.

కారిడార్లో నడుస్తుంటే మురుగువాసన కొట్టింది అతనికి.

"ఓ.పిలో చాల పెద్ద క్యూ ఉంది పేషంట్లది. ఆ క్యూలో గంటా పైనే నిలబడ్తే పుల్లారావువంతు వచ్చింది.

"ఈ వూళ్ళో ఇంతమంది రోగులున్నారా?! ఆశ్చర్యపోయాడు పుల్లారావు.

"ఏంటలా మిడిగుడ్లేస్కొని చూస్తున్నావ్. నీ రోగమేంటో చెప్పు" అరిచాడు రిజిస్టర్ మీద గుద్దుతూ కౌంటర్లోని మనిషి.

పుల్లారావు ఉలిక్కిపడ్డాడు.

"జలుబండి.. కాస్త జ్వరం కూడా ఉందండి. జ్వరం వెంటనే తగ్గేలా చూడండి. లేపోతే మా ఆవిడ ఊరోకోదు" అన్నాడు పుల్లారావు.

కౌంటర్లో మనిషి ఓసారి పుల్లారావు వంక విసుగ్గాచూసి పేరు వయసు అడిగి చీటీ రాసిచ్చి "ఆరో నెంబర్ గదిలోకి వెళ్ళు" అన్నాడు.

పుల్లారావు ఆరో నెంబర్ గది దగ్గరికి వెళ్ళాడు అక్కడ వార్డు బాయ్ పుల్లారావుని బెంచి మీద కూర్చోమని అతని చేతిలోని చీటీ అందుకున్నాడు.

"మీ వంతు వచ్చినప్పుడు పిలుస్తాం" అన్నాడు.

అక్కడ పుల్లారావుతోబాటు చాలా మంది డాక్టరుగారి పిలుపుకోసం ఎదురు చూస్తున్నారు.

ఈసారి కూడా పుల్లారావు వంతు వచ్చేసరికి మరో గంటపైనే పట్టింది.

వార్డ్ బాయ్ పుల్లారావుని పిలిచాడు. పుల్లారావు దగ్గరికి వచ్చిన తరువాత రెండు రూపాయలు ఇవ్వమన్నాడు.

"ప్రతిచోటా ఇదేపనా? నేనేం ఇవ్వను" అని గదిలోకి అడుగు పెడ్తుండగా వార్డుబాయ్ పుల్లారావు కాళ్ళమధ్య తన కాలుని పెట్టాడు.

అంతే...

దెబ్బకి పుల్లారావు బ్యాలెన్సు అవుటయిపోయి గబగబా ముందుకు తూలుకుంటూ పోయి బోర్లా పడిపోయాడు.

కళ్ళు తెరిచి చూస్తే డాక్టరుగారి కాళ్ళమీద ఉన్నాడు.

"నీకేం భయంలేదు నీ ప్రాణాలకి నా ప్రాణం, నీ ఆరోగ్యానికి నా కత్తి అడ్డేస్తా.. లేలే" అన్నాడు డాక్టరు.

పుల్లారావు లేచి కూర్చున్నాడు.

డాక్టరు పుల్లారావు చొక్కా ఎత్తి ఛాతీమీద వేల్తో నొక్కి తరవాత "స్టెతస్కోప్ మర్చిపోయా. హి" అని నవ్వి అతని ఛాతీమీద తన చెవిని పెట్టి కాస్సేపు విని శంకర్ జైకిషన్ మ్యూజిక్ విన్నట్టు ఆనందంగా నవ్వి "హెబ్బే.. పెద్ద ప్రమాదం ఏమీలేదు. కాసింత హార్ట్ ట్రబుల్ ఉంది, మా మూలుగా అయితే అందరి గుండే లబ్ డబ్.. లబ్ డబ్ అని కొట్టుకుంటుంది కదా! నీదేమో డుబుక్ డుబుక్ మని చిల్లిపడ్డ బాజాలా శబ్దం వస్తుంది. ఆపరేషన్ చేసేసి సరిజేసేస్తాను. వార్డులో బెడ్స్ ఖాళీ ఉండవుగానీ.. నాకు నాల్గొందలు పారేస్తే మేనేజ్ చేసేస్తా. లేపోతే నేల మీద పారేస్తారు నిన్ను ఆపరేషనయ్యాక కూడా" అన్నాడు.

పుల్లారావు కంగారు పడ్డాడు.

"బాబోయ్.. మీరు హార్టాపరేషనంటున్నా రేంటి?" అన్నాడు వణికిపోతూ.

"మరేం భయంలేదు. ఆపరేషను తుప్పుపట్టిన కత్తులతో కాకుండా మంచి కత్తుల్తోనే చేస్తాను."

"నేను హార్ట్ పేషెంట్ని కానండీ., నాకు జలుబూ జ్వరం ఉంటే ట్రీట్మెంట్కి వచ్చాను."

"అయితే ఇక్కడికెందుకు వచ్చావ్? నేను హార్టు స్పెషలిస్టుని" అంటూ మండిపడ్డాడు ఆ డాక్టర్. "ఇంకా నయం.. మత్తు మందిచ్చేసి గుండెకాయకోస్తే ఏం చేసేవాడివి? పైగా మేం పొరబాటు చేస్తాం అని తప్పు పడ్తారు. చాల్లే ఇహ వెళ్ళు" అన్నాడు.

గది బయటికి వెళ్తున్నప్పుడు వార్డుబాయ్ మళ్ళీ కాలు అడ్డుపెడ్తే బోర్లా పడిపోయాడు పుల్లారావ్.

జ్వరాలు చూసే డాక్టరు గది కనుక్కుని అక్కడికెళ్తే "నీ చీటీ మీద ఆరో నెంబరు గది అని రాసుంది. నేను చూడను" అని అన్నాడు ఆ డాక్టరు మొండికేస్తూ.

మళ్ళీ ఓ.పి దగ్గరికి వెళ్ళి గంటసేపు క్యూలో నిలబడి గది నెంబరు మార్పించుకుని వెళ్తే డ్యూటీ అయిపోయిందని డాక్టరు వెళ్ళిపోయాడు. అక్కడి నర్సు "రేపురా" అంది మొహం చిట్లించి పుల్లారావుతో.

పుల్లారావు నీరసంగా ఇంటి దారిపట్టాడు. జ్వరం వస్తే డాక్టరుకి చూపించుకోడానికి దిక్కులేదు. అసలు ఈ ప్రైవేటు ప్రాక్టీసు మాన్పించి ప్రజలకి ప్రభుత్వం ఏం మేలు చేసిందో అర్థం కాలేదు పుల్లారావుకి. ❋